
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 12 ఏప్రిల్ 2025



ఆటలు ఆడించాలి.. క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి.. పోటీలతో స్ఫూర్తి నింపాలి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా వేదికలపై విజయ కేతనం ఎగరేసేలా క్రీడకారులను తీర్చిదిద్దాలి.. వారే వ్యాయామ ఉపాధ్యాయులు. కానీ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యే వారికి క్రీడా నైపుణ్యాలు అవసరం లేదట.. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తే చాలంటూ గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీలో చేర్చిన వింత సిలబస్‌పై వివిధ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. త్వరలో డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో ఈ వింత సిలబస్‌ను కూటమి ప్రభుత్వం మార్చాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే డీఎస్సీకి మార్పులు చెయ్యాలని లేకుంటే పాఠశాల స్థాయిలో ఆటలు అబాసుపాలేనని.. బడి పిల్లల్లో క్రీడా స్ఫూర్తి కోల్పోయి శారీరక, మానసిక ఎదుగుదల కోల్పోతారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డీఎస్సీ సిలబస్‌లో ఉన్నట్లుగా థియరీ 70 శాతం, క్రీడా ప్రావీణ్యానికి 30 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు అభ్యర్థిస్తున్నాయి.

- పీఈటీ పోస్టుల భర్తీకి వింత సిలబస్
- క్రీడా నైపుణ్యం ఉన్న వారికి అవకాశాలు తక్కువే
- గత ప్రభుత్వ సిలబస్ మార్చాలంటున్న విద్యావేత్తలు
- వచ్చే డీఎస్సీకి మార్పులు చెయ్యాలి.. లేకుంటే ఆటలు అబాసుపాలే
- థియరీ 70, క్రీడా ప్రావీణ్యానికి 30 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని సంఘాల అభ్యర్థన

ఆటలొద్దు.. పాఠాలు చాలు



క్రీడల్లో శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

తెనాలి, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయులంటే బడుల్లో చిన్నారులను మైదానాల్లో పరుగులు పెట్టించాల్సిన అవసరం లేదట. ఆటలతో సంబంధం లేదంట. అసలు వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా నైపుణ్యాలే అవసరం లేదంట. ఈ వింత సిలబస్‌తో గత వైసీపీ ప్రభుత్వం 2024లో డీఎస్సీని ప్రకటించింది. ఎటువంటి స్కిల్ టెస్ట్ లేకుండా కేవలం థియరీలో నైపుణ్యం ఉంటే చాలని వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో మార్పులు చేసింది. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపాల్సిన ఉపాధ్యాయులకు ఆ నైపుణ్యాలు లేకుండా ఎంపికైతే నెలకొనే పరిస్థితిపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు చదువుతోపాటు క్రీడలకూ అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. దేహదారుఢ్యాన్నే కాకుండా, మానసిక వికాసాన్ని పెంపొందించే క్రీడలు నేర్పించే వారు ఆటల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులై ఉండాలి. అటువంటి వారికి ప్రాధాన్యం ఇస్తే రేపటి రోజున మైదానాల్లోనూ చిన్నారులను పరుగులు పెట్టించగలుగుతారు. కానీ ఎటువంటి ఆటలతో పనిలేకుండా, ఏ క్రీడా నైపుణ్యం లేకుండా కేవలం పాఠాలు చెప్పగలిగినవారు, ఛాయిస్‌తో సమాధానాలు రాసి, అదృష్టం కలసి వచ్చిన వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే రేపటి రోజున రాష్ట్రంలో క్రీడల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్కిల్ టెస్ట్ విధానాన్ని కాదని థియరీకే ప్రాధాన్యం ఇస్తూ జారీ చేసిన గత ఉత్తర్వులపై వ్యాయాయ ఉపాధ్యాయులుగా రాణించాలని ఆశపడేవారికి శరాఘాతంగానే మారాయి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో వ్యాయామ ఉపాధ్యాయులుగా రాణించాలనుకునే వారిలో ఆశలు చిగురించాయి. గతంలో వైఎస్ హయాంలో కూడా 100 శాతం థియరీకే ప్రాధాన్యం ఇవ్వగా ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం రద్దుచేసి, పాత పద్ధతినే కొనసాగించింది. జగన్ ప్రభుత్వంలో వైఎస్ హయాంలోని సిలబస్‌నే తిరిగి ప్రవేశపెట్టారు. 1882 నాటి హంటర్ కమిషన్ నుంచి 1977 నాటి (మిగతా 8వ పేజీలో)

క్రీడలతో సంబంధం లేని సిలబస్

డీఎస్సీలో పీఈటీ పోస్టులకు గతంలో ఉన్న 70 శాతం థియరీ, 30 శాతం ప్రాక్టికల్స్‌తో కూడిన ప్రాక్టికల్స్ సిలబస్‌గా ఉండేది. జగన్ ప్రభుత్వం ప్రాక్టికల్ టెస్ట్ అవ సరం లేదని, కేవలం థియరీలో ఉత్తీర్ణత సాధిస్తే చాలన్నట్లు మార్చేశారు. అదేమని పీడీ, పీఈటీ సంఘాలు ప్రశ్నిస్తే గర్భిణులు పరీక్షల్లో పాల్గొంటే ప్రాక్టికల్స్ ఎలా చేస్తారని, అటువంటి వారికోసమే ఆ విధానాన్ని తొలగించి, కేవలం థియరీకే ప్రాధాన్యం ఇచ్చామంటూ కబుర్లు చెప్పుకొచ్చారు. శారీరక వ్యాయామానికి సంబంధించిన థియరీ, క్రీడల్లో ఏర్పడే గాయాలకు చికిత్స వంటివాటితో లోతుగా సిలబస్ ఇచ్చి, వ్యాయామానికి సంబంధించినవి లేకపోవడం విస్తు కలిగిస్తున్నది. పైగా ఇవన్నీ ప్రశ్నలకు పేరాగ్రాఫ్‌లుగా సమాధానాలు వివరణాత్మకంగా రాయాల్సిన పనికూడా లేదు. కేవలం ఆబ్జెక్టివ్ విధానంలో సమాధానాలుగా నమోదు చేస్తే సరిపోతుంది. ఈ పద్ధతిలో చివరకు థియరీలో కూడా ప్రావీణ్యం చూపాల్సిన అవసరం లేకుండా కేవలం అదృష్టాన్ని పరీక్షించుకున్నాచాలన్నట్లు సిలబస్ రూపొందించడం విశేషం. ఇటు వంటి వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే రేపటి తరం చిన్నారుల క్రీడా నైపుణ్యం అటకెక్కినట్లే.


సాగర్ కుడికాల్వకు నీరు బంద్

- నీటి సరఫరాను నిలిపేసిన అధికారులు
- బుగ్గవాగు నుంచి రెండు రోజులు మాత్రమే
- జలాశయంలో 515 అడుగులకు పడిపోయిన నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు నీటి సరఫరా నిలిచిపోయింది. జలాశయంలో నీటి మట్టాలు పడిపోవడంతో కుడి కాల్వకు నీటి విడుదలను జలవనరుల శాఖ నిలిపేసింది. ప్రస్తుతం బుగ్గవాగు నుంచి స్వల్పంగా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది కూడా రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోనున్నది. ఇక డ్యాం నుంచి నీటి సరఫరా ఉండదని అధికారులు తేల్చి చెబుతున్నారు. జలాశయంలో నీటి నిల్వ 140.49 టీఎంసీలకు పడిపోయింది. సాగర్ డెడ్ స్టోరేజి 498 అడుగులు కాగా ప్రస్తుతం 515 అడుగులకు చేరింది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న 28.31 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు వినియోగించుకునే అవకాశం ఉంది. డ్యాంకు వరద వచ్చే వరకు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటి విడుదలను నిలిపేశారు. జలాశయంలో ఉన్న నీటి నిల్వలను వేసవిలో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కేఆర్ఎంబీ, ప్రభుత్వం నిర్ణయించింది. మే నెల మూడో వారంలో తాగునీటి అవసరాలకు డ్యాం నుం.చి నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరుల శాఖ ఎస్సీ కృష్ణమోహన్ తెలిపారు. నీటి సరఫరా నిలిపివేయడంతో కాల్వల చివర భూముల్లో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

20 శాతం వరకు ఆవిరి..



సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు నిలిచిపోయిన నీటి సరఫరా

ఏప్రిల్ నెలలోనే ఎండ తీవ్రత అధికంగా ఉంది. మే నెలలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతున్నది. ఈ నేపథ్యంలో జలాశయంలో ఎండకు ఆవిరి కూడా అధికంగా ఉండే అవకాశం ఉంది. ఉన్న నీటిలో 20 శాతం వరకు ఆవిరయ్యే అవకాశం ఉంటుందని అధికారుల అంచనా. ఇది దాదాపు నాలుగు నుంచి ఐదు టీఎంసీలని అధికారులు భావిస్తున్నారు. అవసరం లేని సమయంలో అధికంగా నీటిని కాల్వలకు సరఫరా చేయడంతో పెద్దఎత్తున నీరు వృథాగా వాగుల్లో ప్రవహించింది. ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే తాగు నీటికి గడ్డు పరిస్థితులు ఏర్పడేవి కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ధర పతనం తగ్గిన ఆదాయం



- మిర్చి యార్డు ఆదాయంలో 16 శాతం లోటు
- రూ.106 కోట్ల లక్ష్యం కాగా రూ.90 కోట్లే వసూలు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరలు పతనమై రైతులు అల్లాడుతుండగా.. ఆ ప్రభావం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (జీఏఎంసీ) ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావన్నే చూపింది. కొన్నేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా మార్కెట్ ఫీజు వసూళ్లలో మిర్చియార్డు లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆదాయంలో నుంచి వివిధ పనుల కోసం ఖర్చు చేసే నిధులను ప్రభుత్వం సక్రమంగా విడుదల చేస్తుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. గత ఆర్థిక సంవత్సరంలో గుంటూరు ఏఎంసీకి మార్కెటింగ్ శాఖ రూ.106 కోట్ల సెస్సు వసూళ్లని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే గత ఆరేడు నెలలుగా మిర్చి ధరలు నేలచూపులు చూస్తున్నాయి. క్వింటాల్ ధర రూ.7 వేల నుంచి రూ.11 వేల మధ్యనే కొనసాగుతుంది. దీంతో మిర్చియార్డులో టర్నోవర్ తగ్గింది. ఆ ప్రభావం ఒక శాతం వసూలు చేసే మార్కెట్ సెస్సుపై పడింది. మార్చి మొదటి వారంలో రూ.77.40 కోట్లు వసూలైంది. గత నెల నుంచి నిత్యం లక్షా 20 వేలకు పైగా మిర్చి టిక్కీలు యార్డుకు రావడంతో కొద్దిగా ఆదాయం పెరిగింది. అయినా ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చి 31కి సెస్సు రూ.90 కోట్ల వరకే వసూలైంది. కేటాయించిన లక్ష్యం కంటే దాదాపుగా 16 శాతం లోటు ఏర్పడింది.

బడ్జెట్‌పై కసరత్తు..

నూతన ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై మార్కెటింగ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. మార్కెట్ ఫీజు లక్ష్యం, యార్డులో చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలను మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్ విజయసునీతకు నివేదించి ఆమోదం తీసుకోనున్నారు. అయితే గత ఏడాది నిర్దేశించిన మార్కెట్ ఫీజు రూ.106 కోట్ల లక్ష్యాన్ని తగ్గిస్తారా... అలానే ఉంచుతారా అన్నది సస్పెన్స్‌గా మారింది. వేసవి సెలవుల అనంతరం ఏమైనా ధర పెరిగితే తప్ప ఆదాయం పెరగదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను తప్పక అన్వేషించుకోవాల్సిన పరిస్థితి జీఏఎంసీకి ఉత్పన్నమైంది.

ధరల దూకుడు

- ఉత్పత్తి వ్యయంతో సంబంధం లేకుండా.. సిమెంట్ బస్తాకు రూ.140.. ఇరన్ టన్ను రూ.12000 పెంపు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా పెరుగుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాణ్యమైన ఇసుక అందుబాటు ధరలో అందుతోంది.. ఇక నిర్మా ణ రంగం పరుగులే అనుకుంటున్న తరుణంలో సిమెంట్, ఇనుము ధరలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. ఉత్పత్తి వ్యయంతో సంబంధం లేకుండా ధరలను కంపెనీలు అమాంతం పెంచేస్తు న్నాయి. కంపెనీ లు సిండికేట్ అయి నిర్మాణదారుల జేబులు ఖాళీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ధరల నియం త్రణపై ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో నిర్మాణ రంగం ప్రమాదంలో పడనున్నది. ఇదే జరిగితే కార్మికుల ఉపాధి ప్రశ్నా ర్థకంగా మారనుంది. వైసీపీ హయాంలో సిమెం ట్ బస్తా రూ.500, టన్ను ఇనుము రూ.90 వేల వరకు పెరిగాయి. టీడీపీ ప్రభుత్వ హ యాంలో ధర ల నియంత్రణ ఉంటుందని అందరూ భావించారు. అయితే ఇం దుకు విరుద్ధంగా నాటి పరిస్థితులు పునరావృతం అవుతా యన్న ఆందోళన సర్వత్రా నెల కొంది. రోజుల వ్యవధిలోనే ఇను ము టన్ను రూ.12000, సిమెం ట్ బస్తా రూ.140 నుంచి రూ.150 వరకు పెరిగింది. ఇంత టితో ధరల పెరుగుదల ఆగే పరిస్థి తులు కానరావడం లేదని మార్కెట్ విశ్లే షకులు అంచనా వేస్తున్నారు. సిమెంట్ బస్తా రూ.500, టన్ను ఇనుము రూ.90 వేలకు చేరుకోవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే జరిగితే నిర్మాణాలను చాలావరకు వాయిదా వేసుకునే పరిస్థితులు నెలకునే అవకాశం ఉంది.





సీసీ రోడ్ల పనులకు శ్రీకారం



పనులు చేపట్టకముందు రోడ్డు



మార్చి 25న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తితో కలిసి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

- ఏళ్ల సమస్య పరిష్కారమవుతుందని హర్షం
- అక్షరం అండగా పరిష్కారమే అజెండాకు స్పందన
- సమస్యలపై ఆంధ్రజ్యోతి చొరవ చూపాలని ప్రజల ఆకాంక్ష

వినుకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా సరైన రోడ్డు లేక పడిన అవస్థలు త్వరలో పరిష్కారం కానున్నాయి. వర్షం వస్తే బురద రోడ్డుతో ఇళ్లలో నుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితులు మారిపోనున్నాయి. స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే



అజెండాగా' కార్యక్రమానికి స్పందన వచ్చింది. ప్రజాసమస్యల పరిష్కారంపై జనవరి 28న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పట్టణంలోని 31, 23వ వార్డులో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను పరిశీలించి పలు హామీలు ఇచ్చారు. ఈ క్రమంలో రెండు వార్డుల్లో రూ.62.60 లక్షల మేర పను లకు మార్చి 25న జీవీ శంకుస్థాపనలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో 31వ వార్డులో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం పనులను ప్రారం భించారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు సమస్య పనులు ప్రారంభంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చూపుతున్న చొరవను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపట్టి సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

- అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొననున్న చంద్రబాబు

8

తత్కాల్ బుకింగ్స్ సమయాల్లో ఎలాంటి మార్పులు లేవు

● సోషల్ మీడియా పోస్టులు నమ్మొద్దు ● ఐఆర్‌సీటీసీ స్పష్టీకరణ

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీ నుంచి రైల్వే తత్కాల్ బుకింగ్స్ సమయాలు మారుతున్నాయంటూ గత కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతున్న పోస్టులలో ఎలాంటి వాస్తవం లేదని ఐఆర్‌సీటీసీ సంస్థ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఏసీ తరగతుల బుకింగ్స్ నిత్యం ఉదయం 10 గంటలకు, స్లీపర్‌క్లాస్ రిజర్వేషన్ 11 గంటల నుంచి ప్రారంభమౌతున్నాయి. ప్రీమియం తత్కాల్ బుకింగ్‌కు ఎలాంటి ప్రారంభ సమయం లేదు. తత్కాల్‌తో పాటే ప్రీమియం తత్కాల్ కూడా బుకింగ్ చేసుకొనే అవకాశం ఉన్నది. అయితే రైల్వే శాఖ ఈ సమయాలు మారుస్తూ ఉదయం 10.30 గంటలకు ప్రీమియం తత్కాల్, 11 గంటలకు ఏసీ తరగతులు, మధ్యాహ్నం 12 గంటలకు స్లీపర్/సెకండ్ సిట్టింగ్ బుకింగ్స్‌ని అనుమతిస్తుందని సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెట్టేస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ మరో మూడు రోజుల్లోకి వచ్చేయడంతో రైలు ప్రయాణీకులంతా నిజమే కాబోలు అని భావిస్తున్నారు. అయితే ఐఆర్‌సీటీసీ సంస్థ అవన్నీ ఫేక్ పోస్టింగ్స్ అని స్పష్టం చేసింది. తత్కాల్ టిక్కెట్ల బుకింగ్స్‌లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పందించింది. ఏజంట్లకు అనుమతించిన బుకింగ్ సమయాలు కూడా యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నది. రైల్వే తత్కాల్ కోటా టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇందుకోసం రైల్వే ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్ల వద్ద వేకువజాము నుంచే తాకిడి ఉంటుంది. అలానే ఐఆర్‌సీటీసీ ఏజంట్లకు ఒక్కో ప్యాసింజర్‌కి అదనంగా రూ. 100 చెల్లించి బుకింగ్ చేయించుకొంటుంటారు. ఐఆర్‌సీటీసీ పర్సనల్ ఐడీలు కలిగిన వాళ్లు కూడా ప్రయాణాల సమయంలో సాధారణ బుకింగ్స్ లభ్యం కాక పోతే ఐఆర్‌సీటీసీ ద్వారా తత్కాల కోటా టిక్కెట్లను బుకింగ్ చేసుకొంటుంటారు. ప్రీమియం తత్కాల్ కోటా టిక్కెట్లు అనేవి ప్రతీ టిక్కెట్‌కు ధర పెరుగుతూ పోతుంది. ఈ కారణంగా ఆ కోటాలో చాలా సందర్భాల్లో టిక్కెట్లు మిగిలిపోతాయి. వాటిని తత్కాల్ వెయిటింగ్‌లిస్టు టిక్కెట్లకు సర్దుబాటు చేస్తారు. ఈ కారణంగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌కు డిమాండ్ ఉంటుంది. వేజండ్ల, నంబూరు, పేరేచర్ల, న్యూగుంటూరు వంటి చిన్న రైల్వేస్టేషన్లలో తత్కాల్ కోటా బుకింగ్స్‌కు రద్దీ ఎక్కువగా ఉంటుంది.

ఈ నేపథ్యంలో యూట్యూబర్లు కొంతమంది వారి పోస్టులకు వ్యూయర్‌షిప్ పెంచుకోవడానికి తాజాగా ఈ తత్కాల్ బుకింగ్స్ సమయాన్ని రైల్వే శాఖ మార్చబోతున్నదని పేర్కొంటూ పోస్టింగ్ పెట్టారు. అంతేకాకుండా తేదీ కూడా ఈ నెల 15గా పేర్కొనేసరికి చాలామంది నిజమేనని నమ్మి ఆ పోస్టులను తెగ చూసేశారు. దీంతో యూట్యూబర్లకు కావాల్సినంత లైక్‌లు, వ్యూస్ వచ్చేశాయి. వారి లక్ష్యం నెరవేర్చుకొన్నారు. కాగా ఇలాంటి ఫేక్ పోస్టులు పెడుతూ తప్పుదోవ పట్టిస్తున్న సామాజిక మాధ్యమాల నిర్వాహకులపై రైల్వే, ఐఆర్‌సీటీసీ చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

పేటలో బైకుల దొంగ అరెస్టు : 17 బైకులు స్వాధీనం

చిలకలూరిపేట ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత మూడు సంవత్సరాలుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న స్థానిక జాలయ్య కాలనీకి చెందిన మాచర్ల ఏసు అలియాస్ వేణు అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు చిలకలూరిపేట అర్బన్ సిఐ పి రమేష్ బాబు అర్బన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం తెలిపారు. ఇతడి వద్ద నుండి 17 మోటారు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జాతీయ రహదారిపై ఎఎంజి చెక్ పోస్ట్ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా బైక్ నడుపుతున్న ఏసు తారాసపడ్డాడని అన్నారు. అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వాహనాల దొంగతనం బయటపడిందని పేర్కొన్నారు. ఇతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు వివరించారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనందపేటలో జరిగిన వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ శుక్రవారం తెలిపారు. ఈనెల ఒకటో తారీఖున పాత గుంటూరులోని ఆనందపేటలో కర్రలతో, క్రికెట్ స్టంపులతో దాడి చేయడంతో షేక్ ఖాజాబీ అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న నాగేంద్రబాబు అలియాస్ సన్నీ, షేక్ ఆరిఫ్ లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరపరిచినట్లుగా డీఎస్పీ పేర్కొన్నారు.

విత్తనాల షాపుల్లో విస్తృత తనిఖీలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని విత్తనాల షాపుల్లో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం జరిగిన ఈ తనిఖీలలో కమిషనర్ కార్యాలయ సహాయ సంచాలకులు ఆర్.శశిధర్ రెడ్డి, ఏడీలు సురేషన్, ఖడ్గం రమణ కుమార్ పాల్గొన్నారు. జిల్లాలోని పత్తి విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను, విత్తనాల షాపులను, పార్సిల్ కార్యాలయాలను అధికారులు తనిఖీ చేశారు. వివిధ పత్తి విత్తనాలు షాపుల్లో 65 బీటీ విత్తనాల నమూనాలను సేకరించారు. రికార్డులను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు. హెచ్‌టి కలిగిన బీటీ విత్తనాల ఉత్పత్తి సాగును కేంద్ర ప్రభుత్వం నిషేధించింది కాబట్టి వాటిని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ నేతలు రాజకీయ నాయకులు కాదు... దొంగల సముహం!

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు రాజకీయ నేతలే కాదని, వారు పక్కాగా దొంగల సముహమని జిల్లా జనసేనపార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం లాడ్జి సెంటర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా, పోలీసు శాఖను తీవ్రంగా అవమానించే విధంగా ఉన్నాయని గాదె విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతల తీరులో మార్పు రావవడం లేదని తెలిపారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయన అవినీతికి సహకరించి అధికార దుర్వినియోగానికి పాల్పడి పలువురు ఉన్నతాధికారులు కోర్టులు, జైళ్ల చుట్టూ తిరుగుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. సోషల్ మీడియాను అడ్డు అదుపు లేకుండా రాజకీయ ప్రత్యర్థులను అసభ్య పదజాలంతో దూషిస్తూ దుర్వినియోగం చేసింది కూడా వైసీపీ నేతలేనని గాదె స్పష్టంచేశారు. వైఎస్ భారతిపై అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిని కూటమి ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపిందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇలా ఎందుకు వ్యవహరించలేదని ఆయన నిలదీశారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు శిఖా బాలు, చట్టాల త్రినాథ్, తాడికొండ కిషోర్ తదితరులున్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న వర్సిటీ అధికారులు

అట్టహాసంగా ముగిసిన ఏఎన్యూ మహోత్సవం

పెదకాకాని, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏఎన్యూ మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం లఘు చిత్ర పోటీలు జరిగాయి. ఈ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వాటికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు జరిగిన క్రీడల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, 200, 400 మీటర్ల పరుగు పందాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థుల తమ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో వీసి ప్రొఫెసర్ కే. గంగాధర్, రెక్టర్ ప్రొఫెసర్ కె రత్న శిలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి సింహాచలం, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి

వినుకొండటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు డివైడర్ ఢీకొని పురోహితుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పార్వతీపురం వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను ప్రకారం బొల్లాపల్లి గ్రామానికి చెందిన పురోహితుడు వెలమకన్ని వీరరాఘవశర్మ (36) వృత్తి రీత్యా ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి త్రిపురాంతకం వెళ్తుండగా పార్వతీపురం వద్ద డివైడర్ ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని వినుకొండ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే వీరరాఘవశర్మ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య యశ్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కళ్యాణం.. వైభోగం



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు





ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండ రైల్వేస్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు వివరాలను పరిశీలిస్తే... ప్రకాశం జిల్లా ఖమ్మం సమీపంలోని రావిపాడుకు చెందిన రాయపాటి శ్రీనివాసరావు (50) మిత్రులతో కలిసి బొల్లాపల్లి మండలంలోని బ్యాండ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగించుకొని మిగతా సభ్యులు ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని చందారం వెళ్తున్న నేపథ్యంలో రావిపాటి శ్రీనివాసరావును వినుకొండ రైల్వేస్టేషన్‌లో దింపారు. టిక్కెట్ తీసుకొని 2వ ప్లాట్‌ఫారం ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా గుంటూరు నుంచి దొనకొండ వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ తగలడంతో గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని వినుకొండ పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య సరస్వతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

21వ తేదీన మోడల్ పాఠశాల ప్రవేశపరీక్ష

వినుకొండటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెం మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న నిర్వహించాల్సిన పరీక్ష ఈస్టర్ పండుగ సందర్భంగా 21వ తేదీకి పోస్టుపోన్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకొని పరీక్షలకు హాజరుకావాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

15 నుంచి జూన్ 14 వరకు చేపలవేట నిషేధం

రేపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్రజలాల్లో ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మత్స్యకారులు ఎవరూ వేట నిషేధిత సమయంలో సముద్రంలో వేటకు వెళ్ల కూడదని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి సాయిసందీప్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం సముద్రతీరప్రాంతంలో 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట నిషేధమన్నారు.



గంగిరెడ్డిపాలెంలో దొండతోటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు

50 శాతం రాయితీ పచ్చిరొట్ట ఎరువులు

● ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 50శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు ఇస్తున్నట్లు పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు రైతులకు సూచించారు. శుక్రవారం గంగిరెడ్డిపాలెం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికీ విశిష్టగుర్తింపు సంఖ్య నమోదుచేసుకోనివారు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

మాచర్లటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మాచర్లలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండోరోజు శుక్రవారం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. కైంకర్యపరులు సింగం బాలకృష్ణారావు, లక్ష్మీ సుజాత దంపతులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అర్చకులు రాజగోపాలచార్యులు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం రాత్రి 9:30 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు.

డయల్ యువర్ డీఎంకు ఐదు ఫిర్యాదులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ విజయకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు 5 ఫిర్యాదులు వచ్చాయి. అమరావతి-నరసరావుపేట,బెల్లంకొండ-గుంటూరుకు బస్సులు కావాలని, సత్తెనపల్లి నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ఏర్పాటుచేయాలని, అమరావతి మండలం నెమలికల్లుకు బస్సుసర్వీసు ఏర్పాటుచేయాలని ప్రయాణీకులు కోరారు.

గడ్డి పెంచటానికి ఉచితంగా రూ.16వేలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో రైతులు 50సెంట్లలో గడ్డిసాగు చేసుకుంటే ప్రభుత్వం ఉపాధి పథకం కింద రూ.16వేలు ఉచితంగా అందిస్తుందని పశుసంవర్థకశాఖ సత్తెనపల్లి ఏడీ ఎం నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 75శాతం రాయితీతో గడ్డివిత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. పశువుల దాహార్తిని తీర్చటానికి ప్రభుత్వం ప్రతి మండలానికి 10 నీటితొట్లెలు మంజూరు చేసిందన్నారు. ఈనెల చివరినాటికి వాటిని పూర్తిచేస్తామన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు వద్ద పట్టణానికి చెందిన పలువురు అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక శాఖ తరుపున శుక్రవారం కోర్టు వద్ద గుర్తింపుకార్డులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందజేశారు. కార్యక్రమంలో యేల్లినేడి రామస్వామి, పలువురు న్యాయవాదులు, కార్మికశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ధూళ్ళిపాళ్ళ జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామ సమీపంలోగల గోరంట్ల వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గమనించి రూరల్ పోలీసులకు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి 40-45 సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని, మృతుని కుడిచేతిపై శిలువగుర్తు పచ్చబొట్టుఉందని పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు 8019998643లోగాని, రూరల్ పోలీసుస్టేషన్‌లో సమాచారం తెలపాలని సీఐ తెలిపారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

నకరికల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ వివాదాలకు దూరంగా ఉండాలని సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్ అన్నారు. శుక్రవారం చీమలమర్రి గ్రామంలో ప్రజలతో ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మహిళల పట్ల గౌరవంగా ఉండేలా నేర్పించాలన్నారు. సీసీ కెమేరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ముప్పాళ్ళ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ జి.సుచరిత శుక్రవారం తెలిపారు. ముప్పాళ్ళ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో గల 11కేవీ లైన్స్, పరికరాల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తామన్నారు.

● రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ పెదమస్తాన్ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

● నకరికల్లు: మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నకరికల్లు మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ గౌస్ తెలిపారు.

● మాచవరం: మండల గ్రామాల్లో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

● బెల్లంకొండ: పిడుగురాళ్ళ 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా బెల్లంకొండ, పాపాయపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని మండలంలోని అన్నిగ్రామాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ పవర్‌కుమార్ తెలిపారు.

● పెదకూరపాడు: ఈనెల 12వ తేదీ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారి దాసరి రామకృష్ణ శుక్రవారం తెలిపారు.

● మాచర్లటౌన్: మాచర్లలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలగుతుదని ఆ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.

● గురజాలటౌన్: మండలంలోని గురజాల, పులిపాడు, దైద, జంగమహేశ్వరపురం, చర్లగుడిపాడు, మాడుగుల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఎం శ్రీనివాసరావు తెలిపారు.

● పిడుగురాళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండమోడు, మహవీర్‌నగర్, జానపాడు, బైపాస్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్‌కుమార్ తెలిపారు.

● కారంపూడి: మండలంలోని కారంపూడి, గాదెవారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరాంజనేయులు తెలిపారు.

● దుర్గి: మండలంలోని దుర్గి, ముటుకూరు, కోలగుట్ల, పోలేపల్లి, ధర్మవరం, నెహ్రూనగర్ తండా, అడిగొప్పుల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీశైలం తెలిపారు.

తాగునీటి సరఫరాపై దృష్టి సారించరూ..!

● 50వేల జనాభాకు ఒక్క ట్యాంకర్‌తో సరఫరా

● దాచేపల్లి నగర పంచాయతీలో దుస్థితి

దాచేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి నగర పంచాయతీలో ఉన్న 50వేల మంది జనాభాకు ఒకే ఒక్క ట్రాక్టర్‌తో తాగునీరు అందిస్తున్న నగర పంచాయతీ తీరు పై ప్రజల నుంచి తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో దాచేపల్లి, నారాయణపురం, అంజనాపురం కాలనీ, దుర్గాభవానీ కాలనీ, జంగాలకాలనీ, ఇరికేపల్లి, నడికూడి, అలుగుమల్లిపాడు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ప్రధానంగా అంజనాపురం, నారాయణపురం, దుర్గా భవానీ కాలనీ, జంగాల కాలనీలలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. అయా ప్రాంతాల్లోని వారంతా మైనింగ్ క్వారీలు, ముగ్గుమిల్లులు, మార్కెట్‌యార్డులు, పంటపొలాల్లో కూలీలుగా, కార్మికులుగా పనిచేసుకునేవారు. పగలంతా పని చేసుకొని సాయంకాలం ఇంటికొచ్చే సమయానికి తాగేందుకు గుక్కెడు నీరులేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు వారికోసం నగర పంచాయతీ ఒక ట్రాక్టర్ మాత్రమే ఏర్పాటుచేసింది. ఆ ట్రాక్టర్‌కు కూడా ఒక్కడే డ్రైవర్. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9వరకు ఆ డ్రైవర్ ఆ ట్రాక్టర్‌తోనే ప్రజలకు తాగునీరు అందిస్తూ ఉంటాడు. దాచేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద ట్రాక్టర్‌లో తాగునీరు నింపుకొని రెండు కిలోమీటర్లు ప్రయాణం చేసి స్థానికులకు తాగునీరు అందించాల్సి వస్తుంది. ఒకే ట్రాక్టర్ పలు మార్లు తిరగాల్సి రావటంతో గంటల రతబడి సమయం పడుతోంది. అయినా ప్రజల తాగునీటి సమస్యపై నగర పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవటం శోచనీయం. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడకుండా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కన్నా

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

● ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మారావు జ్యోతిరావుపూలే జయంతిని తాలూకా సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి పూలే కృషి చేశారన్నారు. ఆయనతో పాటు పలువురు టీడీ పీ నేతలు, బీసీ నేతలు పాల్గొన్నారు. పట్టణంలో వెంకటపతి నగర్ సాంఘికసంక్షేమ కళాశాల వసతి గృహంలో పూలే జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ నంబూరు ఆనంద్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమఅధికారి పాలెపోగు సుమణి తదితరులు పాల్గొన్నారు. మదర్‌థెరిస్సా సేవాసమితి, డాక్టర్ విలియం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవాసంస్థ, బీసీ సంఘాలు, వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

● నకరికల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో శుక్రవారం నకరికల్లులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, సీహెచ్ వెంకటేశ్వర్లు, వీరయ్య, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, అంకమరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే : ఎమ్మెల్యే ప్రవీణ్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే జీవితం మనందరికీ ఆదర్శమని, నాటి సమాజంలో మహిళలకు విద్యా అవకాశాలు కల్పించటంలో ఎనలేని కృషిచేశారన్నారు.

● అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త విద్యాప్రదాత మహాత్మా జ్యోతిరావ్‌పూలే జయంతి వేడుకలను పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం హనుమంతరావు, ఎంపీడీవో శివపార్వతి, ఎంఈఓ శివబాబు, సీపీఎం నాయకులు సూరిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతి కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముందుగా ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. పూలే సాంఘిక సంస్కర్త అని హైకోర్టు అడ్వకేట్ దేవకుమార్ అన్నారు. గురువారం స్థానిక లీస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూలే జయంతి జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చిలుకా చంద్రయ్య, శిఖా నరసింహారావు, రాజారావు, వెంకటేశ్వరరావు, మందా క్రీస్తురాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా తదితరులు

బలహీనవర్గాల ఐక్యతతో అభివృద్ధికి బాటలు

● టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూరి

దాచేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు కలసి ఉంటేనే అభివృద్ధికి బాటలు వేయవచ్చని టీటీడీబోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా ప్రసంగిస్తూ అభివృద్ధే ధ్యేయంగా, బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా ఉండాలని కోరారు. చదువు అభివృద్ధికి తొలిమెట్టు అన్నారు. ఆయా కార్యక్రమాల్లో 14వ వార్డుకౌన్సిలర్ షరీఫ్, గద్దల వేదమణి, ముత్యం వెంకటేశ్వర్లు, గరికపాటి వెంకటేష్ పాల్గొన్నారు.

● మాచర్లటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని కుక్కమూడి ప్రసాద్ అన్నారు. పట్టణంలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి రవి, గురజాల అప్పారావు, వరదల జ్యోతి, మాచవరపు నాగేశ్వరరావు, పరిమళ రాజారావు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన పూలే జయంతిని జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, పోతురాజు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దళిత బహుజన భీమ్ సేన రాష్ట్రనేత పేరుపోగు జార్జి ఆధ్వర్యాన పూలే జయంతిని జరిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ గబ్రూనాయక్, ఎంపీఈవో ఫణికుమార్‌నాయక్, ఎస్ఐ రవిబాబు, పంచాయతీరాజ్ డీఈ విభూషణ్, ఏఈలు, ఎంఈవో అల్లి సురేష్, ఏవో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈఈ సింగయ్య, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యాన పూలే జయంతి నిర్వహించారు.

● రెంటచింతల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను శుక్రవారం టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కె.వెంకటరమణ, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, బీసీ నేత కట్టెబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ళ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, బలహీనవర్గాల భవితకు మార్గదర్శి మహాత్మా జ్యోతిరావుపూలే అని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద పూలే విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్, వైసీపీ నేతలు పాల్గొన్నారు. గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే అని కూటమి నేతలు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు ఆధ్వర్యాన పూలే జయంతి నిర్వహించారు.

● దాచేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నారాయణపురం టీడీపీ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, అక్కినపల్లి బాలయ్య, నాయబ్ అబ్దుల్లా, కొప్పుల గిరి తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే చిరస్మరణీయుడని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

● కారంపూడి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని బీజేపీ రాష్ట్ర నేత శెట్టి హనుమంతురావు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కోశాధికారి కె.పెదఆంజనేయులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



రెంటచింతల: పూలేకి నివాళులర్పించిన విద్యుత్ ఎస్ఈ వెంకటరమణ

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగ ర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్రవారం నాటికి 515.10 అడుగులు ఉంది. ఇది 140.49 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1800క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 30.49 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 800 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డులకు ఉపాధ్యాయుల ఎంపిక

పెదకూరపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు, జలాలపురం గ్రామాలకు చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, రెబ్బవరపు శిరీషలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్టు సౌతర్న్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పీ నాగయ్య వేర్వేరు ప్రకటనల్లో శుక్రవారం తెలిపారు. ఈనెల 13వ తేదీన గుంటూరులో అవార్డులను బహూకరించనున్నట్టు పేర్కొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 50శాతం రాయితీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీస్థలాల పన్నులను ఏకమొత్తంగా చెల్లించే బకాయిదారులకు ప్రభుత్వం వడ్డీపై 50శాతం రాయితీ కల్పించిందని మునిసిపల్ కమిషనర్ ఎన్ ఆనంద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 30వ తేదీ లోపు బకాయిదారులు పన్నులు చెల్లించి రాయితీ పొందాలన్నారు. పన్నులు ముందస్తుగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఐదు శాతం రిబేట్ అవకాశం కల్పించిందని తెలిపారు. పాత బకాయిలు దారులు, ప్రస్తుతం ముందస్తు చెల్లింపు దారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎస్టీవో కార్యాలయం తనిఖీ

రాజుపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం ఎస్టీవో కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ఖజానాధికారి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ వార్షిక తనిఖీలలో భాగంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసినట్లు చెప్పారు.

కోర్టులో వాదనలు వినిపించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గతంలో సత్తెనపల్లి డీఎస్పీగా పనిచేసిన ఆదినారాయణపై కోర్టులో దాఖలుచేసిన ప్రైవేట్ కేసుకు సంబంధించి శుక్రవారం సత్తెనపల్లి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై తన వాదనలు వినిపించారు. ఆదినారాయణ డీఎస్పీగా ఉన్న సమయంలో తొండపిలో ఘర్షణ కేసులో వైసీపీ వారు మారణాయుధాలతో తనపై తీవ్రంగా దాడిచేసినా, తన పీఎస్‌కి తీవ్రగాయాలైనా 324 కేసుపెట్టి చేతులు దులుపుకున్నాడన్నారు. ఆ సమయంలో రాజుపాలెం, ముప్పాళ్ళ మండలాల్లో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని న్యాయమూర్తికి వివరించారు.

ఇళ్ల స్థలాల కోసం కన్నాకు న్యాయవాద గుమస్తాల వినతి

సత్తెనపల్లి న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడు మర్రి నరసింహారావు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాద గుమస్తాలు తమకు ఇళ్ళ స్థలాలు ఇప్పించాలని కోరుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్, న్యాయవాద గుమస్తాలు హాజరయ్యారు.

దాడి కేసులో తండ్రీకొడుకులపై కేసు నమోదు

దుర్గి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి కేసులో తండ్రి, కొడుకులపై దుర్గి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని అడిగొప్పులకు చెందిన తోట నాగేశ్వరరావు, కృష్ణమూర్తిలు అన్నదమ్ములు. ఏడేళ్ల క్రితం కృష్ణమూర్తి పొలంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనులకు ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంకిగా ఉండడంతో కృష్ణమూర్తి ట్రాన్స్‌ఫార్మర్ వేరే చోటుకు మార్చేందుకు గురువారం ప్రయత్నించాడు. ఈ క్రమంలో నాగేశ్వరరావు, అతని కుమారుడు లక్ష్మీనారాయణలు కృష్ణమూర్తిపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు నాగేశ్వరరావు, అతని కుమారుడు లక్ష్మీనారాయణపై శుక్రవారం ఎస్ఐ సుధీర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలులకు మత్స్యకార బోట్లు ధ్వంసం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయంలో గురువారం రాత్రి గాలి బీభత్సం సృష్టించడంతో మత్స్యకారుల మరబోట్లతోపాటు పుట్టీలు, వలలు ధ్వంసం అయ్యాయి. మండలంలోని విజయపురి సౌత్ డౌన్‌మార్కెట్‌కు చెందిన అర్జిల్లి సింహాద్రి, బొందు రాజులకు చెందిన బోట్లు, పుట్టీలు, వలలు ధ్వంసం అయ్యాయి. సింహాద్రికి సుమారు రూ.2లక్షలు, రాజుకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

నేలవాలిన అరటి తోటలు..

రెంటచింతల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులు వీయడంతో అరటితోటలు నేలవాలాయి. గురువారం రాత్రి 8 గంటలనుంచి వీచిన బలమైనగాలులకు మిట్టగుడిపాడు, రెంటచింతల, రెంటాల, మంచికల్లు గ్రామాల్లో 18ఎకరాల్లో అరటి తోటలన్నీ పడిపోయాయి.

ఇరిగేషన్ భూమిని కబ్జా చేసినవారిపై చర్యలు: తహసీల్దార్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ భూమిని కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని విజయపురిసౌత్ గ్లోరి క్రైస్ట్ చర్చి ఎదురుగా కబ్జాకు గురైన ఇరిగేషన్ భూమిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నాగులవరం గ్రామానికి చెందిన కొందరు నాయకులు ఈ భూదందాలో పాలుపంచుకున్నట్లు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల పరిశీలనలో నిర్ధారణ అయినట్లు చెప్పారు. ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు వేసి విక్రయాలు జరపడం నేరమన్నారు. వారిపై చర్యలు తీసుకోకున్నట్లు తెలిపారు.



కబ్జా భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి

అచ్చంపేటలో మెగా వైద్యశిబిరం

● 402 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో శుక్రవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో మెగా వైద్యశిబిరం జరిగింది. కాటూరి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంపులో 402మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో వందమందికి కాటూరి మెడికల్ కళాశాలలో అదనంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని నలుమూలల నుంచి రోగులు హాజరయ్యారు. తొలుత ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి క్యాంపును ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, కొండవీటి పాపారావు, ఎంపీడీవో శ్రీనివాస్, భూక్యా రమేష్, వెనిగండ్ల కోటయ్య, పోట్ల శ్రీనివాసరావు, మొక్కపాటి గిరిబాబు, తిరువాయిపాటి ఆంజనేయులు, కొలగాని సత్యనారాయణ, చల్లా అనూపకళ, నల్లపాటి చందు, బత్తుల శ్రీనివాసరావు, తాళ్ళూరి సుబ్బారావు, కోట చంటి, పొన్నెకంటి శివయ్య తదితరులు హాజరయ్యారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచింతల ప్రాజెక్టు పరిధిలో గల కేతవరం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో కలసి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, హనుమంతరావు నాయక్, తులసీనాయక్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, గుడిసె కొండయ్య, సర్పంచ్ జ్యోతి సముద్రం, వెన్నా సీతారామిరెడ్డి, ఇక్కుర్తి పేరయ్య, రామకృష్ణ, ఈవో వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు

మతస్వేచ్ఛను హరించాలని చూస్తున్న కేంద్రం

క్రోసూరులో ముస్లిం సంఘాల భారీ నిరసన ర్యాలీ



రోడ్డు పై బైఠాయించిన ముస్లిం సంఘాల నాయకులు

క్రోసూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం ద్వారా మత స్వేచ్ఛను హరించాలని చూస్తుందని ముస్లిం సంఘాల నాయకులు ఆరోపించారు. ఆ చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం క్రోసూరులో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి అమరావతి బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ర్యాలీ స్టేట్ బ్యాంక్ నుంచి గాంధీచౌక్, ఎన్‌టీఆర్ సర్కిల్, అమరావతి బస్టాండ్, పిడుగురాళ్ళ బస్టాండ్ నుంచి నాలుగురోడ్ల సెంటర్‌వరకు సాగింది. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, మైనార్టీల హక్కులు కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముస్లిం సంఘాల నాయకులు, మత పెద్దలు ముక్తి సాహెబ్ జమాలుద్దీన్, ఖలీల్, ప్యాన్సీ ఖాదర్, అబ్దుల్ ఖాదర్, షేక్ గఫూర్, కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● ఎక్సైజ్ సీఐ తులసీ



మద్యం షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ తులసీ, ఇతర అధికారులు

క్రోసూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో మద్యం షాపుల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ టీ తులసీ హెచ్చరించారు. శుక్రవారం క్రోసూరు మద్యం షాపుల్లో ఆమె తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. మద్యం సీసాల నుంచి నమూనాలు సేకరించారు. ఎంఆర్‌పీ ధరల కన్నా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంఆర్‌పీ అమ్మకాల గురించి వినియోగదారులను ఆరా తీశారు. ఆమె వెంట ఎక్సైజ్ ఎస్ఐలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించేలా ఉన్నత విద్యను అభ్యసించాలి

● చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఇంటర్‌లో చేరే విద్యార్థులు, ఇంటర్ నుంచి ఉన్నత విద్యకు వెళ్లేవారు లక్ష్యాన్ని చేరుకునేలా విద్యను అభ్యసించాలని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ధరణికోటలోని ఆర్‌వీవీఎస్ కళాశాలలోని శ్రీధాన్యకటక జేఈఈ-ఎస్ఈఈటీ అకాడమీలో జరిగిన ఫేర్‌వెల్‌డే కార్యక్రమంలో జీవీ ముఖ్యఅతిధిగా మాట్లాడారు. ఫేర్‌వెల్‌డేలో విద్యార్థులు సీనియర్‌లకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో చేకూరి జాజిబాబు, ఎస్ గాంధీ, దండా సాంబశివరావు, అకాడమీ డైరెక్టర్ శివప్రసాద్, ఎన్ అప్పారావు, టి.రామిరెడ్డి, ఎం అప్పారావు, వెంకటకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పర్యటన

మాచర్లటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి శనివారం కారంపూడి, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

జీజీహెచ్‌లో అత్యాధునికంగా.. ఎంసీహెచ్ బ్లాక్



గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో తుది దశకు చేరిన ఎంసీహెచ్ బ్లాక్

- రూ.86 కోట్ల వ్యయం.. 600 పడకలు.. 9 ఓటీలు
- ఎన్నారై వైద్యుల విరాళాలతో జీజీహెచ్‌లో నిర్మాణం
- ఏడాది చివరికి సిద్ధం.. జనవరిలో సీఎంచే ప్రారంభం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో రూ.86 కోట్లతో అత్యాధునిక రీతిలో మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) బ్లాక్ రూపు దిద్దుకుంటోంది. గుంటూరు వైద్య కళాశాలలో విద్యను అభ్యసించి ఉత్తర అమెరికాలో స్థిరపడిన ఎన్నారై వైద్యులు ఈ భవనానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని విరాళంగా అందజేస్తున్నారు. అమెరికాలోని చికాగో, న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్, టెక్సాస్ తదితర నగరాల్లో పేరుగాంచిన శిశు వైద్యశాలలను పరిశీలించి, గుంటూరు జీజీహెచ్‌లో ఈ ఎంసీహెచ్ బ్లాక్ డిజైన్‌ను రూపొందించడం విశేషం. ఆధునిక సౌకర్యాలతో సెల్లార్, జీ ప్లస్ ఫైవ్ భవనంగా ఇది రూపుదిద్దుకుంటోంది. ఇందులో 600 పడకల సామర్థ్యంతో పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాలు ఏర్పాటు చేస్తున్నారు. శిశు వైద్యానికి 300 పడకలు, ప్రసూతి విభాగానికి 300 పడకలు కేటాయించారు. ప్రస్తుతం సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. మార్బుల్ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తికావడంతో.. 2026 జనవరిలో సీఎం చంద్రబాబుచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంసీహెచ్ బ్లాక్‌కు రూ.35 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు అందజేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

అత్యాధునిక శైలి.. ఆధునిక పరిజ్ఞానం

స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ప్రమాణాలతో ఎంసీహెచ్ బ్లాక్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నారు. అమెరికాలో పలు శిశు వైద్యశాలలను పరిశీలించి అక్కడి వైద్యులతో చర్చించి రూపొందించిన ఈ ఎంసీహెచ్ బ్లాక్ డిజైన్‌ను భారత నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండు అంతస్తులను స్త్రీ, ప్రసూతి విభాగానికి కేటాయించారు. మూడు, నాలుగు, ఐదు ఫ్లోర్లను శిశు వైద్య విభాగంతో పాటు ఎన్ఐసీయూ, పీఐసీయూ వార్డులకు కేటాయించారు. సెంట్రల్ ఎయిర్ కండీషన్డ్‌గా నిర్మిస్తున్న ఈ భవనంలో ప్రతి వార్డులో మానిటర్లు, ఆక్సిజన్ ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎనిమిది లిఫ్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ప్రమాణాలతో అత్యాధునిక ల్యామినార్ ఎయిర్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వైద్య విద్యార్థుల కోసం లేబర్ ఫ్లో థియేటర్లు (స్టూడెంట్స్ డెమాన్‌స్ట్రేషన్ రూమ్స్) నిర్మిస్తున్నారు. లేబర్ ఫ్లో థియేటర్‌లో భారీ స్క్రీన్‌లపై వైద్య విద్యార్థులు ప్రసవాలను తిలకించవచ్చు. ఐదో ఫ్లోర్‌లో 500 మంది కూర్చునే విధంగా సెమినార్ హాల్‌ను, ప్రతి ఫ్లోర్‌లో వంద సీట్ల సామర్థ్యంతో మిని సెమినార్ హాళ్లు నిర్మించారు.



● డాక్టర్ ఉమాదేవి గవిని

యావదాస్తి ఎంసీహెచ్ బ్లాక్‌కు విరాళం

గుంటూరు జీజీహెచ్‌లో రూపుదిద్దుకుంటున్న ఎంసీహెచ్ బ్లాక్ కోసం పలువురు ఎన్నారై వైద్యులు కోట్లాది రూపాయలు విరాళాలుగా అందిస్తున్నారు. చికాగోలో అలర్జీ/ఇమ్యునాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ ఉమదేవి గవిని ఈ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆమె తన యావదాస్తి..సుమారు రూ.22 కోట్లను ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి విరాళంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో.. మూడేళ్ల కిందట అమెరికాలో జరిగిన జింకానా 17వ రీయూనియన్ సమావేశంలో హాజరైన డాక్టర్లు కరతాళ ధ్వనులతో ఆమెను అభినందించారు. డాక్టర్ ఉమాదేవి గవిని అందించిన స్ఫూర్తితో పలువురు ఎన్నారై వైద్యులు తమ వంతుగా భారీ విరాళాలు ప్రకటించారు. అనంతరం జరిగిన జింకానా వార్షిక సమావేశంలో.. ఈ బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి డాక్టర్ ఉమాదేవి భర్త, దివంగత డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరిట నామకరణం చేయాలని నిర్ణయించి.. "డాక్టర్ కానూరి రామచంద్రరావు జింకానా మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్" బ్లాక్‌గా పేరును నిర్ణయించారు.



భవనంలో జరుగుతున్న పాల్స్ సీలింగ్ పనులు

గుంటూరుకు 100 మంగళగిరికి 50

- 150 ఎలక్ట్రిక్ బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ
- గుంటూరు-2 డిపోతో పాటు మంగళగిరి డిపోలోనూ ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్..



గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీకి త్వరలో 150 ఎలక్ట్రిక్ బస్సులు సమకూరనున్నా యి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగరాలకే కేటాయించనున్న ఈ విద్యుత్‌బస్సులు గుంటూరుకు 100, మంగళగిరి నగరానికి మరో 50 బస్సులు కేటాయించనున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలో రానున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్, గ్యారేజ్‌ల వంటి సదుపాయాల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

గుంటూరు -2 డిపోలోనే ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీని కోసం సివిల్ పనులకు సంబంధించి కూడా రూ. 20 కోట్లు పైనే అవసరమవుతాయని కూడా ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ప్రధానంగా ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో గుంటూరు-1,2 డిపోలతో పాటు గ్యారేజ్ స్టేషన్‌లు ఇక్కడే ఉన్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా బస్టాండ్ చెరువులను తలపిస్తోంది. ఇటువంటి సమస్యల నేపథ్యంలో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ఏర్పాటు పనులపై సమీక్షలు చేస్తున్నారు. గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లో వరద నీరు చేరకుండా గ్యారేజ్ ఎత్తు పెంచాలని, అందు కోసం సివిల్, ఎలక్ట్రిక్ పనులకు అంచనాలను రూపొందించారు. ముందుగా గ్యారేజ్‌ను ఆరు నుంచి ఏడు అడుగులకు పైగా ఎత్తు పెంచటం, అవసరమైన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ పనులు చేపట్టటం వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మంగళగిరి డిపోలోనూ ఛార్జింగ్ స్టేషన్..

మంగళగిరికి కేటాయించిన 50 ఎలక్ట్రిక్ సర్వీసులకు సంబంధించి అక్కడే ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్ తెలిపారు. ఇందుకు అనువైన స్థలం మంగళగిరి డిపోలో ఉంది. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌తో పాటు గ్యారేజ్‌ల నిర్మాణ పనులకు సంబంధించి అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. మంగళగిరి కేంద్రంగా ఎలక్ట్రిక్ బస్సులు విజయవాడ, రాజధాని అమరావతి, తెనాలి, హైకోర్టు , గుంటూరు వంటి ప్రాంతాలకు రాకపోకలకు వినియోగించాలని రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేస్తున్నారు.

మహిళా భద్రతకు.. శక్తి యాప్

ఆపద సమయంలో బాలికలు, యువతులు, మహిళలు తమను తాము రక్షించుకునేందుకు క్షణాలలో పోలీస్ సహాయం పొందేందుకు వీలుగా ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించింది. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ఈ యాప్‌పై మహిళల్లో ముఖ్యంగా బాలికలలో అవగాహన కల్పించేలా ప్రభుత్వం చర్యలు చెప్పట్టింది.



సత్తెనపల్లి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌లోని ఎస్‌వోఎస్ ఆప్షన్ నొక్కితే వారి లొకేషన్, వారి వీడియో, ఆడియో కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండానే ఫిర్యాదు అందుతుంది. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు ఆప్షన్ ద్వారా వాహన నెంబరు, ప్రయాణ మార్గాన్ని షేర్ చేయవచ్చు. పోలీస్ కంట్రోల్ రూమ్ వాహనాన్ని ట్రాక్ చేస్తుంది. మార్గం తప్పితే వేంటనే స్పందిస్తుంది. లైంగిక వేధింపులు, సలహాలు, గృహ హింస, సైబర్ క్రైమ్స్ ఫోటో మార్ఫింగ్, పరువు హత్యలు తదితర ఏ నేరాల గురించి అయిన గెట్ ఏ కంప్లైట్ ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. భర్త వేధింపులు గృహ హింస వంటి సమస్యలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సేవలు పొందే వీలు ఉంటుంది. అదృశ్యమైన పిల్లల సమాచారం అందజేసి పోలీసుల సహాయం తక్షణమే పొందవచ్చు. అప్రమత్తత కోసం కుటుంబ సభ్యులు, స్నేహితుల ఐదు ఫోన్ నెంబర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆపద సమయంలో ఎస్‌వోఎస్ బటన్ నొక్కిన వెంటనే సమాచారం పోలీసులకు చేరుతుంది. మహిళల వేధింపులే కాకుండా బహిరంగ మద్యపానం, మదకద్రవ్యాల వినియోగం, చీకటి ప్రదేశాలలో అసాంఘిక కార్యకలపాలను ఫిర్యాదు చేయవచ్చు. అత్యవసర సమయంలో నైట్ షెల్టర్లులో ఆవాసం పొంది ఉదయం వెళ్లవచ్చు సిబ్బంది విదుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఆయా పరిధిలో ఉన్న ప్రతి సమస్యను సమరస్యంగా పరిష్కరించేలా ఈ యాప్ ఎంతగానో సహకరిస్తుంది. అత్యంత వేగంగా శక్తి యాప్ ఇన్‌స్టాల్ అవుతుంది.

మహిళ భద్రతే లక్ష్యం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శక్తి యాప్ మహిళ భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పించటమే పోలీస్ యొక్క లక్ష్యం. మహిళలు అందరూ మహిళా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అపద సమయంలో ఉపయోగించుకోవాలి.

- డీఎస్పీ హనుమంతురావు డీఎస్పీ, సత్తెనపల్లి

అవగాహన కల్పిస్తున్నాం

మహిళలపై జరుగుతున్న వేధింపులు, దాడుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు శక్తి యాప్ రక్షణ కవచం. పాఠశాలలు, కాలేజిలలో చదువుకుంటున్న బాలికలకు ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. అపద ఎదురైనప్పుడు ఎస్‌వోఎస్ బటన్‌ను ప్రెస్ చేస్తే చాలు. లోకేషన్ ఆధారంగా వారిని గుర్తించి రక్షించేందుకు పోలీసులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు.



- కిరణ్, సత్తెనపల్లి సీఐ

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

● అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొననున్నచంద్రబాబు



● సీఎం సభా స్థలాన్ని ఎక్స్‌కవేటర్, రోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

తాడికొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగే డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు పొన్నెకల్లు గ్రామం సిద్ధమవుతోంది. కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఇప్పటికే అధికారులు, టీడీపీ పార్టీ నాయకులు సభ స్థలాన్ని గుర్తించి బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్నారు. పొన్నెకల్లు బైపాస్ రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా సీఎం బహిరంగ సభలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని ఇంటి నుంచి హెలీకాప్టర్ ద్వారా పొన్నెకల్లు చేరుకుంటారు. అక్కడ నుంచి ఎస్సీ కాలనీలో ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి బహిరంగ సభ జరిగే స్థలానికి చేరుకుంటారు. ఎస్సీ వర్గానికి చెందిన 2000 మందితో ముఖాముఖి మాట్లాడుతారు. తదనంతరం నియోజకవర్గంలోని పార్టీ క్యాడెర్‌తో సమావేశం నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ సభ స్థలంలో జరిగే ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పార్టీ క్యాడెర్‌తో కలిసి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. హెలీప్యాడ్, బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని ఎక్స్‌కవేటర్, రోలర్లతో చదును చేస్తున్నారు.

కారుణ్య నియామకాలు
చేపట్టాలని వినతి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ సమయంలో చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పెదబాబు, సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ సీఈవో జ్యోతిబసుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల జీతాల నుంచి మినహాయిస్తున్న పీఎఫ్ నగదు చాలావరకు వారి జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో నమోదు కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ఖాతాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు, పీఎఫ్ క్లోజర్లను, పీఎఫ్ లోన్లు పెట్టిన వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్లు కమతం శ్రీనివాసరావు, ఎస్కే. బాజీ, తుళ్లూరు మండల అధ్యక్షుడు దిబ్బయ్య, సీనియర్ నాయకుడు సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆటలొద్దు... పాఠాలు చాలు



(5వ పేజీ తరువాయి)

ఈశ్వర్‌భాయ్ పటేల్ కమిటీల వరకు సిలబస్‌పై పలు సూచనలు ఇచ్చాయి. ప్రశ్నాపత్రం పార్ట్-1లో జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్ ఉంటే, పార్ట్-2లో విద్యా దృక్పథాలకు సంబంధించి ఉండాలని సూచించాయి. అయితే దీనికి విరుద్ధంగా 2024 డీఎస్సీలో జగన్ ప్రభుత్వం మార్పులు చేసింది. 100 మార్కుల ప్రశ్నాపత్రంలో ప్రాక్టికల్స్‌తో పనిలేకుండా పూర్తిగా థియరీలో మార్కులు సాధిస్తే ఎంపికయ్యేలా మార్పులు చేశారు. పైగా వివరణాత్మక సమాధానాలు కాకుండా కేవలం ఆబ్జెక్టివ్ పద్ధతిలో సమాధానాలతో అదృష్టాన్ని పరీక్షించుకుంటే చాలన్నట్లు మార్చేశారు. గతంలో 70 శాతం థియరీలో ఉత్తీర్ణత అంతంత మాత్రంగా మార్కులు సాధించినా, క్రీడల్లో నైపుణ్యం ఉన్న వారికి ప్రాక్టికల్స్‌లో కలిసివచ్చేది. వారి ప్రతిభ ఆధారంగా మార్కులు పెరిగేవి. దీంతో నిజమైన క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా అవకాశం దక్కేది. అయితే కొత్త విధానంతో ఇదంతా తారుమారైంది. మైదానంలో ఆటలు ఆడలేని, నాలుగు గోడల మధ్య చదవగలిగినవారే వ్యాయామ ఉపాధ్యాయులుగా వచ్చేస్తున్నారు.

పాత పద్ధతిని తీసుకురావాలి..

పాత విధానం ప్రకారం 100 మార్కుల ప్రశ్నా పత్రం లో 70 మార్కులు థియరీకి ఉంటే, మిగిలిన 30 మార్కు లు ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ స్కిల్ టెస్ట్‌లు, క్రీడల్లో ఉన్న నైపుణ్యం తెలుసుకునేలా ప్రాక్టికల్స్ ఉండేవి. థియరీ పరీ క్ష రాయడంతోపాటు, ఆటలు ఆడటం, ఆటలు ఆడగల సామర్థ్యం ఉందని నిరూపించుకోవడం, ఏదో ఒక క్రీడలో నైపుణ్యం కలిగి ఉంటే చాలన్నట్లుండేది. కానీ ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో ఇవేమీ లేవు. ఈ పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిలబస్‌ను చంద్రబాబు గతంలో మాదిరిగానే మార్చాలని పలువురు కోరుతున్నారు. వచ్చే డీఎస్సీలోనూ 70 శాతం థియరీ, మిగిలిన 30 శాతం క్రీడలకు సంబంధించి ప్రాక్టికల్స్ ఉండేలా మార్పులు చెయ్యాలని వ్యాయామ ఉపాధ్యా య సంఘాలు కోరుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానంతో అథ్లెటిక్స్, వివిధ క్రీడలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన వారికి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపినవారికి అన్యాయమే జరుగుతుందని దీనిని మార్చాలని అభ్యర్థిస్తున్నాయి.

ముఖ్యమంత్రికి విన్నవిస్తాం

క్రీడల్లో ప్రావీణ్యం లేకపోయినా, కేవలం బయాలజీలోనో, ఇతర పాఠ్యాంశాల్లో నైపుణ్యం ఉన్నవారు పరీక్షల్లో ఉత్తీర్ణులై వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికైతే జరిగే నష్టాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తాం. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సిలబస్‌తో భావి క్రీడాకారులకు, ఔత్సాహికులకు తీరని నష్టమే జరుగుతుందని చెప్తాం. క్రీడలపై ఎటువంటి అనుభవం, ఏ ఆసక్తి లేని వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే నష్టమే. రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులే కరువయ్యే పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితుల్లో పాత పద్ధతినే వచ్చే డీఎస్సీలో అమలు చేయాలి.

- కరిముల్లాచౌదరి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విజయవాడ

30 కాదు.. 50 శాతం అవసరం

30 శాతం ప్రాక్టికల్స్ సరిపోదు. దానిని 50 శాతానికి పెంచాలి. ఈ మేరకు గతంలోనే మార్పులు చెయ్యాలని కోరాం. ఈ తరహాలో చేస్తేనే క్రీడలకు న్యాయం జరుగుతుంది. అంత నైపుణ్యం ఉన్నవారు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే మెరికల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గత ప్రభుత్వం క్రీడలకు ఏ మాత్రం ప్రాధాన్యం లేకుండా నీరుకార్చింది. క్రీడా పరికరాలు, మైదానాల మరమ్మతులకు నిధులు లేకుండా చేయడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు.

- ఎన్.వెంకటేశ్వరరావు, విశ్రాంత పీడీల సంఘం రాష్ట్ర నాయకులు, తెనాలి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట లీగల్, రొంపిచర్ల, ఈపూరు, నాదెండ్ల, యడ్లపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సందర్భంగా 33 కేవీ, 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడో ఫేజ్ కరెంటు శనివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఉదయం 9గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

21న మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష

● ఈస్టర్ సందర్భగా తేదీ మార్పు

రొంపిచర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాలలో రాబోయే విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షా తేదీ మారినట్టు ప్రిన్సిపల్ రవి నాయక్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్ష ఈ సందర్భంగా 21వ తేదీకి మార్చినట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. హాల్ టిక్కెట్ తప్పనిసరిగా తీసుకు రావాలని కోరారు. ఓఎంఆర్ షీటు విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

డయల్ యువర్ డీఎం ప్రోగ్రామ్‌లో కొత్త బస్ సర్వీసుల కోసం వినతి

చిలకలూరిపేట ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామం నుంచి ప్రత్తిపాడుకు కొత్త బస్ సర్వీసు వేయాలని, చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం నుంచి నాగభైరవపాలెం మీదుగా చిలకలూరిపేటకు బస్సు నడపాలని శుక్రవారం జరిగిన డయల్ యువర్ డీఎం ప్రోగ్రామ్‌లో ఆయా గ్రామాల ప్రజలు కోరారు. వివిధ గ్రామాల నుంచి 14మంది ఫోన్ చేసి తమ సమస్యలను చెప్పారని ఆర్టీసీ డీఎం రాంబాబు తెలిపారు.

ముగ్గురికి ఉపకార వేతనాల పంపిణీ

చిలకలూరిపేట ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళామందిర్ సెంటర్లో వున్న గౌరీశంకర్ మినీ ఫంక్షన్ హాలులో జేసీ పెయింట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ జరిగింది. తహసీల్దార్ షేక్ హుస్సేన్ కార్యక్రమంలో పాల్గొని ముగ్గురు విద్యార్థులకు రూ.20వేల చొప్పున రూ.60వేల మొత్తాన్ని అందచేశారు. జేసీ పెయింట్స్ అధినేత జి.రాజారత్నం, షాలిమార్ పేయింట్స్ మేనేజర్ జె.అనిల్, చుక్కా విన్సెంట్ పాల్, యూనియన్ బ్యాంక్ ఉద్యోగి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్ఈసీ కళాశాల విద్యార్థికి ఎన్‌సీసీ బెస్ట్ క్యాడెట్ అవార్డు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి హరీష్ 2024 సంవత్సరానికి ఎన్‌సీసీ బెస్ట్ క్యాడెట్ అవార్డు సాధించినట్లు కళాశాల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి హరీష్‌ను కళాశాల నిర్వాహకులు అభినందించారు.

పురుగు మందు తాగి వృద్ధురాలు మృతి

నాదెండ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంకు చెందిన గోరంట్ల సామాజ్యం (80) పురుగు మందు తాగి మృతిచెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం సాయంత్రం పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారద జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని పరిశీలించారు. పురపాలక సంఘం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలు, పరిశుభ్రమైన నీరు విద్యార్థులకు అందించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సిబ్బంది పనితీరు ఉండాలని హెచ్ఎంకు సూచించారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలను చెల్లించాలి: రవిబాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జీ రవిబాబు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధి హామీ బైక్ యాత్రలో గుర్తించిన సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్నాడు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ కూలీలు ఏడు వారాలు వేతనాలు రావాల్సి ఉందన్నారు. నాదెండ్ల మండలం తూబాడులో గత ఉపాధి హామీ పనుల సీజన్‌లో నాలుగు వారాలు పనిచేసిన కూలీలకు అప్పుడు పని చేసిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంతో వేతనాలు అందలేదన్నారు. సోషల్ ఆడిట్‌లో అధికారులకు ఫిర్యాదుచేస్తే ఒక వారం వేతనాలు మాత్రమే ఇచ్చారన్నారు. మిగతా మూడు వారాల వేతనాలు రావాల్సి ఉందని, వేతనాలు ఇవ్వటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కే.రోశయ్య, నాయకులు కే నాగేశ్వరరావు, జె.భగత్, శేషయ్య పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

ఆదర్శనీయం జ్యోతిరావు పూలే జీవితం

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం అందరికి ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ నియోజవర్గ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా చిత్రపటానిక నివాళి అర్పించారు. అనంతరం పల్నాడు రోడ్డులోని జ్యోతిరావుపూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు నివాళి అర్పించారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ చేతి వృత్తుల వారికి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బీసీ సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సబ్సిడీ రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, ఎన్నో విశ్వవిద్యాలయాలు నెలకొల్పారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ. జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

● నరసరావుపేటలోని పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే 199వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా తెలుగు యవత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, తిరుమలకొండ నరసింహారావు, చంద్రశేఖర్, కదం నాగజ్యోతి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జవ్వాజి వెంకట రామయ్య, మల్లికార్జున, దండా అనిల్, వర్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో, విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు.

● నరసరావుపేట లీగల్: పల్నాడు పోలీస్ కార్యాలయంలో పల్నాడు జిల్లా పరిపాలన ఏఎస్పీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ రాజా, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● వినుకొండ: అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. మహాత్మజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

● వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో మహాత్మజ్యోతి రావుపూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు.

● సీపీఐ కార్యాలయంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను నిర్వహించారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు.

● చిలకలూరిపేట: జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని పూలే విగ్రహానికి పార్టీ నాయకులు తోట రాజ రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లో పూలే విగ్రహానికి పార్టీ నాయకులు షేక్ దరియావలి, సాపాసైదావలి, జాన్, కొండవీటి ఆంజనేయులు, అలా శివ గోపి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

● ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు బి శ్రీను నాయక్, కోటా నాయక్, కొండ్రముట్ల నాగేశ్వరరావు, బి చిన్న నాయక్, సలికినిడి నాగరాజు పాల్గొని పూలే నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకులు మాదాసు వృధ్వి రాజ్ సాయి, విశ్రాంత న్యాయమూర్తి కంచర్ల విజయ్ కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పూలేకు ఘన నివాళి అర్పించారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని జేఎన్టీయూ సాంకేతిక విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆవరణలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీ శ్రీనివాసరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,

● ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రావర్ల జగ్గారావు, మండలాధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య,డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాలరావు, చాపల మల్లయ్య, కాటం కోటేశ్వరరావు,మీసాల ప్రసాదు తదితరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన ప్లాంటేషన్ జేసీ

యడ్లపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద సాగుచేస్తున్న పండ్ల తోటలపై డిప్యూటీ సీఎంవో కార్యాలయ ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్ ఆరా తీశారు. శుక్రవారం యడ్లపాడు మండలం కొండవీడులో పర్యటించిన ఆయన ఉపాధి హామీ పథకం కింద సాగుచేస్తున్న నిమ్మ, మామిడి తోటలను, సేద్యపు నీటి కుంటలను ఆయన పరిశీలించారు. ముందుగా తోట శ్రీనివాసరావుకు చెందిన నిమ్మతోట అందులో అంతర పంటలుగా సాగుచేస్తున్న కరివేపాకు పంటలను ఆయన పరిశీలించారు. అంతర పంటలుగా కరివేపాకు సాగు చేయడం వలన ప్రయోజనాల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. గ్రామానికే చెందిన ఎండ్రపల్లి పెద్దన్నకు చెందిన మామిడి తోటను, అందులో ఏర్పాటు చేసిన సేద్యపు నీటి కుంటను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద రావలసిన బిల్లులు వచ్చాయా.. ఇంకా ఏమైనా పెండింగ్ ఉన్నాయా అని రైతును అడిగారు. బిల్లులు వచ్చాయని, పెండింగ్ లేవని రైతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పూలు, పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. రైతులు అధిక మొత్తంలో పూలు, పండ్లతోటలు సాగు చేసి ప్రయోజనం పొందాలని సూచించారు. ఆయన వెంట ఏపిడి హీరాలాల్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శిరీష, ఏపీవో సుందరరావు, టిఏ మాధవి, జెఈ వీరయ్య, రైతులు ఉన్నారు.



కొండవీడు గ్రామ పరిధిలోని కరివేపాకు తోటను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్



విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌నాయక్

విజిలెన్స్ కమిటీ సమావేశం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్‌నాయక్ అధ్యక్షతన శుక్రవారం విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులతో పాటు గుర్తింపు పొందిన పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుత్వ అధికారులు మాట్లాడుతూ వినుకొండ మండల పరిధిలో మొత్తం 32,700 కార్డులు ఉండగా రూరల్ పరిధిలో 33 షాపులు, పట్టణ పరిధిలో 26 షాపుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ ఆదేశం మేరకు బియ్యం, పంచదార అందజేస్తున్నట్లు తెలిపారు. వినుకొండ మండలంలో మొత్తం 114 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా రూరల్‌లో 66, పట్టణంలో 48 కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో మొత్తం 76పాఠశాలలు ఉండగా మధ్యాహ్న భోజన పథకం కింద బియ్యంతో పాటు విద్యార్థులకు నిత్యం రాగిపిండి, బెల్లం, జావ అందజేస్తున్నట్లు విద్యాశాఖ అధికారి జఫ్రుల్లా తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో మార్చి, జూన్, సెప్టెంబరు మాసాల్లో 3వ వారం, గ్రామస్థాయిలో ఏప్రిల్, జూన్, జూలై, అక్టోబరు మాసాల్లో విజిలెన్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మండల ప్రత్యేక అధికారి శ్రీరాములు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు 3862 దరఖాస్తులు: హౌసింగ్ డీఈఈ

శావల్యాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న గృహ నిర్మాణాలకు వినుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 3862మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నట్లు హౌసింగ్ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినుకొండ రూరల్-650, శావల్యాపురం-713, బొల్లాపల్లి-1243, నూజెండ్ల-246, ఈపూరు-1010 దరఖాస్తులు రాగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. దరఖాస్తుదారుల్లో సొంతభూమి కలిగినవారు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇంటి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలని, వీలుకాని యెడల స్థలానికి సంబంధించిన హద్దుల ఫారాన్ని తీసుకోవాలన్నారు. వాటితోపాటు ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు కూడా తీసుకొని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఐదు మండలాల తహసీల్దార్‌లు దరఖాస్తుదారులకు అయా పత్రాలను త్వరగా ఇవ్వాలని కోరారు.

ఎంఏఎం ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా స్ట్రక్చర్‌పై వర్క్‌షాఫ్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా స్ట్రక్చర్ అనే అంశంపై శుక్రవారం ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీవీఐటీ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంసీబీ సాహెబ్ డేటా స్ట్రక్చర్‌లోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ జే రవిశంకర్, అధ్యాపకులు నవీన్, రాధిక, సితార, ఫణిబాబు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ ప్రదేశాలలో సేవ నిర్వహించినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ జగన్మోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం, పాలడుగులో 100 కుటుంబాలకు వంట పాత్రలు, టార్పాలిన్ పట్టలు సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ డీపీ రాజు సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

బొందిలిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళను దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొందిలిపాలెంకు చెందిన మరసా అనిల్‌కుమార్ మద్యం సేవించి మాజీ సర్పంచ్ బత్తుల వెంకటేశ్వర్లు ఇంటి వద్దకు వెళ్ళాడు. ఇటీవల గ్రామంలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపును ప్రస్తావిస్తూ ఆయన భార్యను దుర్భాషలాడుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె భర్త వెంకటేశ్వర్లుకు తెలియజేయడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు అనిల్‌తోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు

బొల్లాపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రాయపాలెం, హనుమాపురం, గరికపాడు, పమిడిపాడు, పాపాయపాలెం, గుమ్మనంపాడు, మేళ్ళవాగు, మర్రిపాలెం, రేమిడిచర్ల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ రాంబొట్లల ఆధ్వర్యంలో తనిఖీల్లో 33 మంది అధికారులు, 114మంది సిబ్బంది 38 బృందాలుగా ఏర్పడి 1477 సర్వీసులు తనిఖీచేశారు. మొత్తం రూ.4.13 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు డీఈఈ కే రవికుమార్, డీఈఈ ఎన్.మల్లికార్జున, డీఈ టీ శ్రీనివాసరావు, ఏఈ కే కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యూ శశశంకర్, ఆపరేషన్ ఏఈ బీ రామాంజనేయులు నాయక్, ఆపరేషన్ డీఈ, అండ్ ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి

● మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు ఫిర్యాదుదారుతో మర్యాదగా నడుచుకోవాలని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. గత ప్రజా సమస్యల వేదికలో సమస్యలపై ఫిర్యాదు చేసిన 8మంది ఫిర్యాదుదారులకు ప్రత్యేకాధికారి ఫోన్‌చేసి సమస్యల పరిష్కారానికి అధికారులు తీసుకున్న చర్యల వివరాలు నమోదు చేసుకొన్నారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సీతారామయ్య, ఈవోపీఆర్డీ సుగుణ, ఎంఈవో సాంబశివరావు, ఏపీఎం వాసుబాబు, ఏపీవో రామారావు, ఏఈవో అశోక పాల్గొన్నారు.

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని ముస్లిం జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం నరసరావుపేట పట్టణంలో ముస్లిమ్ జేఏసీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఈద్గా మైదానం ప్రకాష్ నగర్ నుంచి మునిసిపల్ కార్యాలయం మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు వెనక్కు తీసుకోవాలని నినాదాలు చేశారు. శాంతి ర్యాలీలో మౌలానా షాహిద్ రాజా, ముఫ్తీ రైస్ అహమ్మద్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, అబ్దుల్ గఫార్, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే జిలానీ మాలిక్, ఎంఐఎం మస్తాన్, కరిముల్లా, గోల్డ్‌గఫర్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్, పీడీఏ నల్లపాటి రామారావు, సీఐటీయూ జిల్లా నాయకురాలు డీ శివకుమారి, సిలార్ మసూద్, న్యాయవాదులు, మసీదుల పేష్‌మామ్‌లు, మౌజన్‌లు, ముఫ్తీలు, మౌలాలు, మతపెద్దలు, ముస్లిం యువత పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



నరసరావుపేట మండలం పాలపాడులో పల్లె నిద్రలో పాల్గొని వినతిపత్రాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నాయకులందరూ ఎటువంటి అరమరికలు లేకుండా సమష్టిగా కృషిచేస్తే గ్రామాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆయన సతీమణి సుధారాజేశ్వరి, రాష్ట్ర గ్రంథాలయం సంస్థల చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని నేరుగా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థుల నుంచి వినతిపత్రాలు అందుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి కప్పుపై వేసుకునే పట్టలను, వంట సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కోటప్పకొండలోని కాకతీయ విద్యా ట్రస్టు వసతి గృహాన్ని సందర్శించిన సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు

ఇష్టంగా విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు

● సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు

నరసరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇష్టంగా.. కష్టపడి విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కోటప్పకొండలోని కాకతీయ విద్యా ట్రస్టు నిర్వహిస్తున్న బాలికల వసతి గృహాన్ని శుక్రవారం అయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఒక్కొక్క విద్యార్థినితో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎటుంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నారో తెలుసుకున్నారు. కొందరు ఇంజనీర్లు.. డాక్టర్లు కావాలని అనుకుంటున్నామని బాలికలు చెప్పారు. వసతి గృహంలో బాలికలు అందిస్తున్న సేవలను నిర్వాహకులు అయనకు తెలిపారు. కార్యక్రమంలో ఎ.వెంకయ్య చౌదరి, మందలపు రాధయ్య, గుడిపూడి జగన్నాధం, రావూరి వెంకట్రావు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కన వ్యర్థాల దహనం

● ఆకతాయిల పనిగా అనుమానాలు



యడ్లపాడు జాతీయరహదారి పక్కన వ్యర్థాల దహనంతో వెలువడుతున్న పొగ

యడ్లపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడు పరిధిలోని 16వ నంబరు జాతీయరహదారి పక్కన శుక్రవారం గుర్తు తెలియని ఆకతాయిలు వ్యర్థాలకు నిప్పంటించారు. సుమారు 250 మీటర్ల పొడవున చెత్త దహనమవుతూ ఆవాసాల సమీపంలోకి చేరుకున్నాయి. దీనితో స్థానికులు చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలోని అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. దట్టమైన పొగ, సెగతో జాతీయ రహదారిపై ప్రయాణించిన వారు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

● పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీవరప్రసాద్

వినుకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీవరప్రసాద్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై శుక్రవారం స్థానిక శివయ్యస్తూపం సెంటర్‌లో పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ దేశప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని, 11 సంవత్సరాల్లో సామాన్యులు కొనుగోలు చేసే వస్తువుల ధరలు పెరిగి కొనుగోలు చేసే శక్తి తరిగిపోయిందని, ప్రజలు జీవనం పెనుభారంగా మారిందని విమర్శించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేకహోదా పది సంవత్సరాలు ఇస్తామని నమ్మబలికి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రాయబారం వందనం, సోమవరపు దావీదు, ఎం.రవి, మల్లికార్జున, మస్తాన్, మరియబాబు, వెంకటేశ్వర్లు, కరీమ్, సుభాని, ఖాశీం, నాగూర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ఈపూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పోషణ పక్షోత్సవాలలో భాగంగా శనివారం మండలంలో ఊడిజర్ల ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బీ అరుణ మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిన్నమ్మాయి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యడ్లపాడు మాజీ సర్పంచ్ వెంకట్రావు మృతి

యడ్లపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మాజీ సర్పంచ్ పోపూరి వెంకట్రావు (86) మృతిచెందారు. గత కొద్ది రోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం కన్నుమూశారు. ఆయన 1967-71 మధ్య గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు రెండు పర్యాయాలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. అంతేగాకుండా గ్రామంలో లక్ష్మీ టాకీస్ పేరుతో నిర్మించిన సినిమా థియేటర్‌లో భాగస్వామిగా ఉన్నారు. ఆయనకు భార్య వెంకటరత్నం ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.